సాక్షి
అనకాపల్లి
సోమవారం । 20 । జనవరి । 2025



త్యాగరాజ ఆరాధన

మద్దిలపాలెం : త్యాగరాజ స్వామి వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా కళాభారతిలో ఆదివారం చిన్నారులు కృతులను ఆలపించారు.



ముగిసిన ధనుర్మాసోత్సవాలు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా అన్నదానం చేశారు.

ఆయుష్య హోమం



డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి అమ్మవారు జన్మించిన ఉత్తర నక్షత్ర పుణ్య కాలాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయుష్య హోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

కనకమహాలక్ష్మి సన్నిధిలో జస్టిస్ జ్యోతిర్మయి



అమ్మవారికి పూజలు చేస్తున్న జస్టిస్ జ్యోతిర్మయి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

రేపు నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 3 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీల్లో ఉత్తీర్ణత సాధించిన, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సుగల యువతీ, యువకులు అర్హులన్నారు. జాబ్‌మేళా ఉదయం 9 గంటల నుంచి నిర్వహించడం జరుగుతుందని, మరిన్ని వివరాలకు 9014765287 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

మత్స్యకారులకు చిక్కిన టూనా



వలలకు చిక్కిన టూనా చేపలు

మహారాణిపేట (విశాఖ): సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు భారీగా టూనా చేపలు లభ్యమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి అధిక సంఖ్యలో చేపలు దొరకడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత ఖరీదైన ఈ టూనా చేపలకు విదేశాల్లో డిమాండ్ అధికంగా ఉంది. జపాన్‌లో కిలో రూ.500 నుంచి రూ.600 వరకూ కొనుగోలు చేస్తారని మత్స్యకారులు చెబుతున్నారు. స్థానిక బహిరంగ మార్కెట్లలో కూడా ఈ చేపలకు గిరాకీ ఉంటుంది. స్థానిక వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.

నేడు జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

మహిళల రక్షణకు పింక్ ఆర్మీ సేవలు



పింక్ ఆర్మీతో నాదెళ్ల జ్యోతి, టాటర్ జైన్

సీతంపేట (విశాఖ): గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ శాఖను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ గ్లోబల్ పింక్ ఆర్మీని సింధు మంగళవేద స్థాపించారని తెలిపారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సేవలందిస్తున్నట్టు తెలిపారు. మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పింక్ ఆర్మీ అవగాహన కల్పిస్తుందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు కళాశాల ప్రాంగణాల్లో మహిళల భద్రతకు, హింసను నివారించేందుకు చట్టపరంగా ఉన్న అవకాశాలను వివరిస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖ పార్లమెంట్ బీజేపీ కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, గ్లోబల్ పింక్ సహ వ్యవస్థాపకుడు దీకప్ టాటర్ జైన్, రేంజర్ ఫోర్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శిడగం నాగేంద్రబాబు పాల్గొన్నారు.

నేతన్న నేస్తం.. రిక్త హస్తం

పథకం ఊసెత్తని కూటమి సర్కారు



నేతన్నలకు మళ్లీ కష్టాలు రానున్నాయా.. ఈ ప్రభుత్వ వైఖరి చూస్తుంటే అవుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకానికి కూటమి సర్కారు మంగళం పాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చి 8 మాసాలు గడుస్తున్నా ఈ పథకం ఊసెత్తలేదు. కొనసాగిస్తారో, రద్దు చేస్తారో.. స్పష్టత కూడా ఇవ్వడం లేదు. దీంతో నేతన్నల ఆశలు క్రమక్రమంగా సన్నగిల్లుతున్నాయి. వారు మగ్గాలను వదిలి మళ్లీ కుల వృత్తికి దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

జగనన్నే మాకు నిజమైన నేస్తం



మగ్గం కలిగిన ప్రతి కుటుంబానికి నెలకు రూ.2 వేల ఆర్థిక సాయం ఇచ్చిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. కూటమి సర్కారు వచ్చి ఎనిమిది నెలలు గడుస్తోంది. ఈ పథకం కొనసాగిస్తారో లేదో చెప్పడం లేదు. నేత కార్మికులకు మళ్లీ పాత రోజులు దాపురించే పరిస్థితి కనిపిస్తోంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదు. ముడిసరుకు కోసం వడ్డీలకు అప్పులు తేవడం మా వల్ల కాదు. ప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని యథావిధిగా కొనసాగించి మా కులవృత్తిని కాపాడాలి.

–మాదెం అప్పలరాజు,
నేత కార్మికుడు,
నక్కపల్లి



నక్కపల్లి: కుల వృత్తికి కూడు లేదు గువ్వల చెన్నా.. అని ఆవేదన వ్యక్తం చేస్తూ నేత కార్మికులు వృత్తిని వదులుకున్న చీకటి రోజులు ఒకప్పుడు ఉండేవి. 2019 సంవత్సరానికి ముందు నేతన్నలు అత్యంత దీన స్థితిలో ఉండేవారు. కనీస ప్రోత్సాహం లేక చాలామంది కులవృత్తికి దూరమయ్యారు. నూలు ధర పెరిగిపోవడం, ప్రభుత్వం నుంచి నూలు కొనుగోలుకు సబ్సిడీ ఇవ్వకపోవడం, రుణ సదుపాయం లేకపోవడంతో మగ్గం భారమైన నేతన్న నక్కపల్లి, పాయకరావుపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న కంపెనీలకు, ఇతర **వ్యవసాయ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జనతా వస్త్రాల కొనుగోళ్లు లేక.. పెట్టుబడులు పెట్టి నేసిన వస్త్రాలు సకాలంలో కొనుగోలు కాక** నేతన్నలు ఆర్థికంగా చితికిపోయారు. సొసైటీలు కూడా నష్టాల్లో కూరుకుపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నేతన్నల తలరాతలు పూర్తిగా మారిపోయాయి. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో మగ్గాలకు మహర్దశ వచ్చింది. 2019 ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు చతికిలపడ్డ నేతన్నకు ఊతమిచ్చి తిరిగి మగ్గం చేత పట్టేలా జగనన్న చర్యలు చేపట్టారు. నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశ పెట్టి నెలకు రూ. 2 వేల చొప్పున ఏటా రూ.24 వేల ఆర్థిక సాయం అందించారు. దీంతో చేనేత కార్మికులు కులవృత్తిని కాపాడుకోవడానికి మళ్లీ మగ్గం చేతబట్టారు.

రద్దుల ఖాతాలో కలిపేశారా..

పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో 220 మగ్గం కలిగిన చేనేత కుటుంబాలు ఉన్నాయి. నేతన్న నేస్తం పథకం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి ఏటా రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షలను గత ప్రభుత్వం జమ చేసింది. దీంతో వారు ముడిసరుకు కొనుగోలు చేసి వస్త్రాలు నేసి విక్రయించుకుని ఉపాధి పొందేవారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నింటికీ మంగళం పాడేసింది. వాటి చెంతనే నేతన్న నేస్తం పథకం చేరింది. ఎనిమిది నెలల కాలంలో అమ్మ ఒడి, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్, మత్స్యకార భరోసా, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాలు ఇప్పుడు అమలు కావడంలేదు. నేతన్న నేస్తం పథకాన్ని కొనసాగిస్తారా లేదా అన్న విషయంపై కనీసం ప్రకటన కూడా చేయకపోవడం పట్ల చేనేత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పథకం అమలు చేయకపోతే కులవృత్తికి దూరమే



రెండు రోజుల పాటు భార్యభర్తలిరువురం కష్టపడి ఒక చీర నేస్తే వచ్చే కూలి రూ.500లు. అదే బయట పనులకు పోతే రూ.1500లు సంపాదిస్తాం. కులవృత్తిని వదులుకోలేక ఇబ్బంది పడినా ఇదే పనిలో కొనసాగుతున్నాం. గత ప్రభుత్వంలో మాకు ఏటా రూ.24 వేల చొప్పున సాయం అందించారు. ఈ నిధులతో ముడిసరుకు కొనుగోలు చేసి వస్త్రాలు తయారు చేసి మేమే అమ్ముకునే వాళ్లం. రోజుకు వెయ్యి రూపాయలు ఇంటి వద్దే ఉండి సంపాదించుకునే వాళ్లం. ఈ పథకాన్ని కొనసాగించకపోతే మళ్లీ కులవృత్తికి దూరం కావాల్సిందే.

–గుడ్డటి లక్ష్మి, నేత కార్మికురాలు



నేతన్న నేస్తం కొనసాగించాల్సిందే..



కులవృత్తులను ఆదుకోకపోతే సంస్కృతి సంప్రదాయాలు మరుగున పడతాయి. గతంలో జగనన్న ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లపాటు నిరంతరంగా ఈ పథకాన్ని అమలు చేసి ఆర్థిక సాయం అందించారు. చేనేతకు పూర్వవైభవం తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ పథకాలను రద్దు చేయడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఇది సరికాదు. బడుగు బలహీన వర్గాల వారికి మేలు కలిగే పథకాలకు రాజకీయ రంగు పులమడం మంచిది కాదు.

–ఎల్లేటి సత్యనారాయణ,
నేత కార్మిక నాయకుడు



నక్కపల్లిలో వస్త్రాలు నేస్తున్న నేతన్నలు

జవాబుదారీతనం ముఖ్యం





మాట్లాడుతున్న కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవన్ రామచంద్రన్, హాజరైన న్యాయమూర్తులు

- న్యాయపరమైన అంశాల్లో కచ్చితత్వం ప్రధానం
- సమాచార వ్యవస్థ, న్యాయస్థానాలపై గురుతర బాధ్యత
- పలువురు సీనియర్ న్యాయమూర్తుల అభిప్రాయం
- ముగిసిన సౌత్ జోన్–2 న్యాయమూర్తుల సదస్సు

విశాఖ లీగల్: న్యాయపరమైన అంశాలను సమాజానికి అందించే క్రమంలో సమాచార వ్యవస్థ, న్యాయస్థానాలు జవాబుదారీతనంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పలువురు సీనియర్ న్యాయమూర్తులు స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సౌత్ జోన్–2 న్యాయమూర్తుల సదస్సు ఆదివారం సాయంత్రం ముగిసింది. ఉదయం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.పి.కురియన్ జోసెఫ్ అధ్యక్షతన న్యాయ వ్యవస్థ, ప్రసార మాధ్యమాలు అన్న అంశంపై చర్చ జరిగింది. 'మీడియా ఆన్ జస్టిస్ డెలివరీ సిస్టం, సోషల్ మీడియాతో అనుసంధానం, డిజిటల్ యుగంలో మీడియా స్వేచ్ఛ, పౌర సమాజంపై ప్రభావం' అనే అంశాలపై చర్చించారు. 'ఆధునిక సమాచార వ్యవస్థ–న్యాయ వ్యవస్థపై ప్రభావం' అనే అంశంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. భవిష్యత్తులో పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే న్యాయస్థానాల విషయంలో మీడియా పాత్ర కూడా ఉంటుందని జస్టిస్ కురియన్ జోసెఫ్ అభిప్రాయపడ్డారు. మీడియా అందించే సమాచారం విశ్వసనీయతను కలిగి ఉండాలని సూచించారు. అదే పరస్పర సహకారానికి ప్రామాణికంగా నిలుస్తుందన్నారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్ మాట్లాడుతూ మీడియాలో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయని, కొన్ని సందర్భాల్లో కోర్టులను, కోర్టు పరిధిలోని అంశాలపై ప్రభావం చూపిస్తున్నాయన్నారు.

మీడియా వ్యవస్థపై అవగాహన ఉండాలి

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య మాట్లాడుతూ జ్యుడీషియరీ విభాగంలో పనిచేసే వారు మీడియాపై, అక్కడ జరిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కోల్‌కతాలో జరిగిన ఆర్జీకర్ ఆస్పత్రితో పాటు పలు ఘటనల్లో మీడియా వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. మెయిన్‌స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియాకు ఉన్న పరిమితుల గురించి ఇరు వర్గాలు తెలుసుకోవాల్సి ఉందని చెప్పారు. కోర్టు వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాత్రపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం.సుందర్ విశ్లేషించారు. ఏఐ అనేది న్యాయమూర్తులకు సహకారిగా మాత్రమే ఉంటుందని, ప్రత్యామ్నాయం కాదని అభిప్రాయపడ్డారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి ఎ.ఎం.ముస్తాక్యు బ్లాక్ చైన్ టెక్నాలజీ గురించి మాట్లాడారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఏఐ టెక్నాలజీ గురించి పీపీటీ ద్వారా వివరించారు. సదస్సు ముగింపు సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ప్రెసిడెంట్ జస్టిస్ రవినాథ్ తిలారీ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, ఇతర సీనియర్ న్యాయమూర్తులు, హైకోర్టు, జిల్లా కోర్టుల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జన జాతర

- అంబరాన్ని తాకిన అమ్మవారి సంబరం
- కిక్కిరిసిపోయిన యలమంచిలి పుర వీధులు
- లక్ష మందికిపైగా తరలివచ్చిన భక్తజనం



కనకమహాలక్ష్మి అమ్మవారు



జాతరలో చిన్నారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన

యలమంచిలి రూరల్: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి.. కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా యలమంచిలి భక్తజన సంద్రంగా మారింది. కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులు.. ఎంతసేపు చూసినా తనివితీరని సాంస్కృతిక ప్రదర్శనలు.. ప్రత్యేక ఆకర్షణగా ప్రఖ్యాత డాన్సర్ల నృత్యప్రదర్శనలు.. వెరసి ధర్మవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం అంబరాన్ని తాకింది. యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారి సహా అంతర్గత రహదారులన్నీ జనంతో కిటకిటలాడాయి. పట్టణంలోని ధర్మవరంలో మార్గశిర మాసం నెల రోజుల పాటు కనక మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేశారు. మార్గశిరం పూర్తయిన తదుపరి సంక్రాంతి తరువాత అమ్మవారి నెల రోజుల పండుగను చేయడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం అమ్మవారి నెల రోజుల పండుగ మహోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగని ఏర్పాట్లు చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఇసుకవేస్తే రాలనంత జనం జాతర మహోత్సవాన్ని చూసేందుకు తరలివచ్చారు. స్టేజీ ప్రోగ్రాంలు, డీజే శబ్దాలతో పట్టణం హోరెత్తిపోయింది. బుర్రకథ, మిమిక్రీ, సినీనటుల అనుకరణ నవ్వులు పూయించాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన మహిళల కోలాట బృందాలు, భజనలు, తప్పెట గుళ్లు ఆకట్టుకున్నాయి. యలమంచిలి సీఐ ధనుంజయరావు నేతృత్వంలో 8 మంది ఎస్సైలు, సుమారు 100 మంది పోలీసులు ఎక్కడికక్కడ బందోబస్తును పకడ్బందీగా నిర్వహించారు.



సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న భక్త జనసందోహం

న్యాయం చేయకుంటే నిర్వాసితులతో కలిసి పోరాటం

- పరిహారం చెల్లించాకే పనులు మొదలుపెట్టాలి
- వైఎస్సార్‌సీపీ, సీపీఎం నేతలు వీసం, అప్పలరాజు డిమాండ్



చందనాడలో మాట్లాడుతున్న నాయకులు

నక్కపల్లి: ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన రైతులు, నిర్వాసితులతో చర్చలు జరిపి వారి పెండింగ్ సమస్యలు పరిష్కరించకుండా బల్క్ డ్రగ్ పార్క్ పనులు చేపట్టడం తగదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజులు ఆరోపించారు. ఆదివారం వారు రాజయ్యపేట, చందనాడ గ్రామాల్లో పర్యటించి బల్క్ డ్రగ్ పార్క్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమకు నష్టపరిహారం పూర్తిగా చెల్లించలేదని, డీ ఫారం, సాగు భూములకు పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా భూములను స్వాధీనం చేసుకుని యంత్రాలతో పనులు చేస్తున్నారని మొర పెట్టుకున్నారు. దీనిపై రామకృష్ణ, అప్పలరాజులు మాట్లాడుతూ నష్టపరిహారం కోసం నిర్వాసితులు, రైతులు ఒకపక్క పోరాటం చేస్తుంటే ఏకపక్షంగా పోలీసుల సాయంతో నిర్వాసితుల భూముల్లో పనులు మొదలు పెట్టడం తగదన్నారు. ఈ పనులు తాత్కాలికంగా నిలుపుదల చేసి రైతులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఓట్ల కోసం రైతులకు చేతకాని హామీలు ఇచ్చిన అధికార పార్టీ నాయకులు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారన్నారు. పరిస్థితి చేయి దాటకముందే నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేసి న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే త్వరలో రైతులు, నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేసి పోరాటానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, సర్పంచ్ తళ్ల భార్గవ్, సీపీఎం మండల కన్వీనర్ మన బాల రాజేష్, రైతులు దారబాబు, రాజేష్, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం

చూచుకొండలో నగదు అపహరణకు ప్రయత్నం



చూచుకొండలో ఏటీఎం ఆవరణలో డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ధనుంజయరావు

మునగపాక: చూచుకొండలో ప్రైవేటు ఏటీఎం చోరీకి విఫలయత్నం జరిగింది. నగదు తీసుకునే అవకాశం లేకపోవడంతో ఆధారాలు దొరకకుండా ఉండేందుకు ఏటీఏం ముందు కారం జల్లి వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మండలంలోని చూచుకొండ సచివాలయం పక్కనే ఇండియా–1 ఏటీఎంను కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంను చోరీ చేసేందుకు యత్నించారు. ఏటీఎంలో నగదు ఉంచే బాక్సు ఓపెన్ కాకపోవడంతో తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. అయితే తాము ఎవరో తెలుసుకోకుండా ఉండేందుకు ఏటీఎం ముందు కారం జల్లి చల్లగా జారుకున్నారు. విషయం తెలుసుకున్న సంబంధిత బ్యాంక్ సిబ్బంది ఏటీఎంను తెరిచి చూడగా అందులో ఉండాల్సిన నగదు రూ.6 లక్షల 27 వేలు క్షేమంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అలాగే డీఎస్పీ విష్ణుస్వరూప్, రూరల్ సీఐ ధనుంజయరావు, ఎస్ఐ పి.ప్రసాదరావు ఇండియా–1 ఏటీఎంను పరిశీలించారు.



I AM DOG
మైనేమ్ ఈజ్ గో-2



- మీ ఇంటికొస్తా.. కావలాకాస్తా..
- ఎగురుతా.. దూకుతా.. పాకుతా.. ఫ్రెండ్ షిప్ చేస్తా
- విపత్కర పరిస్థితుల్లో సాయమందిస్తా...
- ఇదీ రోబో డాగ్ విశిష్టత

సాక్షి, విశాఖపట్నం :

హాయ్.. నమస్తే వైజాగ్.
నేను మీ స్ట్రీట్‌డాగ్.. కానే కాదు.. మీ పెంపుడు కుక్కనే.
కాకపోతే.. అప్‌డేటెడ్ వెర్షన్. మై నేమ్ ఈజ్ గో-2.

ఎస్.. మీరు విన్నది చూస్తోంది నిజమే.. ఐయామ్ రోబో డాగ్. విశ్వాసమే కాదు.. విషయమూ చాలా ఎక్కువే.

మేడ్ ఇన్ ఇండియా వెర్షన్. బెంగళూరులో రెడీ అయ్యాను. మిమ్మల్ని పలకరించేందుకు వైజాగ్ వచ్చాను. ఇటీవల ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ పాల్గొని.. అలా బీచ్‌లో తిరుగుతూ విశాఖ అందాలు చూడాలని వచ్చేశాను. ఇక నా విషయానికొస్తే...

మీరు ఇప్పటికే నా గురించి వినే ఉంటారు. ఇటీవలే నేను చాలా ఫేమస్ అయ్యాను.

ఇండియాలో కాదండీ.. అమెరికాలో.. ఎలా అంటారా.!

మన ట్రంప్ తెలుసు కదా.. అధ్యక్షుడు అయ్యాక ఆయన చుట్టూ కాపలాగా నన్నే సెలెక్ట్ చేసుకున్నారు. యూఎస్‌కు చెందిన యునీట్రీ బ్రాండ్ తయారు చేసిన నా లాంటి రోబో డాగ్స్ ఇప్పుడు.. అగ్రరాజ్యం అధ్యక్షుడికి కాపలా కాస్తున్నాయి

మీరనుకుంటున్నట్లు నేను నార్మల్ డాగ్ కాదు. యూనివర్సల్ డాగ్‌ని.

బెంగళూరుకి చెందిన ఫైటెక్ సంస్థ నన్ను తయారు చేసింది. కంప్లీట్‌గా కొత్త టెక్నాలజీతో తయారు చేశారు. ఒకప్పుడు ఇంటిలో కుక్కల్ని పెంచుకున్నారు. అవి ఇప్పుడు ఇంటి మనుషులుగా మారిపోయాయి. వాటి స్థానాన్ని నేను భర్తీ చేస్తాను. జీవం ఉన్న కుక్కలు చేయలేని పనులు కూడా నేను చేస్తాను. కాపలా కాస్తాను. ఎగురుతాను, దూకుతాను. 3 అడుగుల ఎత్తు వరకూ గెంతుతాను. పాకుతాను. అవసరమైనప్పుడు మాట్లాడతాను కూడా.

మీ దగ్గర ఉన్న డాగ్స్ ఏం చేస్తాయి. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వస్తే అరుస్తాయి. **కానీ.. నేను అలా కాదు. ఎవరు యజమాని, ఎవరు కుటుంబ సభ్యులు.. ఎవరు కొత్త వారు అనేది సులభంగా కనిపెట్టగలను. ఎవరిమీదనైనా అనుమానం వస్తే.. నా యజమానికి వార్నింగ్ ఇస్తాను. ఫొటో, వీడియో కూడా తీసి పంపించేస్తాను తెలుసా. ఎలా అంటారా నాలో 360 డిగ్రీలు** తిరిగే లైడర్ కెమెరా హై రిజల్యూషన్‌తో ఉంటుంది. మా యజమానికి ఆ ఫొటో చూసి దొంగ అని కన్ఫర్మ్ చేస్తే చాలు.. పోలీసులకు కూడా ఫోన్ చేసి సమాచారం చేరవేస్తాను. మీ కుక్క ఇది చేస్తుందా..? నెవ్వర్ కదా. అదీ.. ఈ గో2 డాగ్ సత్తా.

కేవలం కాపలా కోసమే కాదండోయ్.. కంప్లీట్ ఎకో సిస్టమ్‌లో అన్ని పనులు చేసేస్తాను. మనుషులు వెళ్లడానికి అవకాశం లేని ప్లేస్‌లకు వెళ్లి సాయం చేసేస్తాను. డ్రోన్ల ద్వారా సాయమందించాలంటే.. ఆ డ్రోన్ ఎగరేయడానికి ఒక స్పేస్ ఉండాలి.. అవి వెళ్లాలంటే అడ్డంకులు ఉండకూడదు. కానీ.. నేను మాత్రం.. చిన్న చిన్న సందుల్లోనూ దూరి కూడా సాయమందించగలను. ఎక్కడైనా పర్వతాల్లో చిక్కుకున్న వారికి ఈజీగా హెల్ప్ చేస్తాను. సిలికాన్ చిప్స్ ద్వారా స్మెల్ డిటెక్టర్, స్మోక్ డిటెక్టర్, రెయిన్ డిటెక్టర్,... ఇలా భిన్నమైన డిటెక్టర్లు నాలో నిక్షిప్తమై ఉన్నాయి.

ఇవన్నీ ఎలా చేస్తాననే కదా మీ డౌట్...

పైథాన్ ప్రోగ్రామింగ్, ఆర్ ప్రోగ్రామ్(మిషన్ లెర్నింగ్) తో ఆపరేట్ అవుతుంటాను. నాకోసం ఒక రిమోట్ కంట్రోల్ కూడా ఉంటుంది. ప్రతిసారి **రిమోట్‌తో** ఆపరేట్ చేయాల్సిన అవసరం లేదు. **కొన్ని కోడ్స్** ఇచ్చేస్తే చాలు.. నా ఓనర్ **హాయి**గా నన్ను నమ్మి నిద్రపోవచ్చు. ఏదైనా సమస్య తలెత్తితే.. నా సాయం అవసరమని అనుకుంటే ఏం చెయాలనే దానిపైనా ప్రోగ్రామింగ్ కూడా నాలో ఫీడ్ చేసుకున్నాను. ఐఓటీ, ఏఐ, మెషిన్ లెర్నింగ్ ద్వారా పనిచేస్తున్నారు.

నా ఫుడ్ ఏంటనే కదా మీ **డౌట్**. అది కూడా చెప్తాను. నాలో **చార్జింగ్** అయిపోతే ఆటోమేటిక్‌గా **చార్జింగ్** పెట్టుకునే సెల్ఫ్ చార్జింగ్ వ్యవస్థ **నాలో ఉంది**. ఫుల్ చార్జ్ అయిపోతే నిరంతరా**యం**గా 8 గంటల పాటు పనిచేస్తాను. బ్యాటరీ **సైజ్** పెరిగితే.. పనిగంటలు కూడా పెరుగుతాయి. **సోలార్** ద్వారా వర్క్ చేసేలా అప్‌డేట్ అవుతున్నా. **అప్పుడైతే** 24/7 సదా యజమాని సేవలోనే...

నేను గో 2 కదా. నా కొత్త వెర్షన్ ఒకటి ఉంది. వాడే నా అన్న.. ఆల్‌టెరైన్. వీడు నేను చేసే పనులతో పాటు అప్‌డేటెడ్‌గా ఉంటాడు. వాడికి ఒక రోబోటిక్ హ్యాండ్ ఒకటి ఏర్పాటు చేస్తే.. చెత్త కూడా శుభ్రం చేసేస్తాడు. మమ్మల్ని కేవలం ఇంటి కాపలా కోసమనే కాదు.. విపత్తుల సమయంలోనూ, సరిహద్దుల భద్రతల విషయంలోనూ వాడాలన్నదే దీని తయారీ వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమని ఇదిగో నన్ను ఎత్తుకున్న మా సంస్థ ప్రతినిధి కృష్ణచైతన్య చెబుతున్నాడు.

అన్నట్లు అసలైన విషయం మీకు చెప్పలేదు కదా.. ఇంట్లో పెంచిన కుక్కలైనా.. కొన్ని సార్లు యజమానులపై దాడి చేస్తుంటాయి కదా.. నేను కూడా ఆ టైపేనండోయ్. నన్ను ఎవరైనా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారనుకోండి. ఇక తగ్గేదేలే. వీడు.. వాడు అని చూడను. దాడి చేసెయ్యడమమే. ఇలాంటిదేదో జరుగుతుందని తెలిసే.. మా ఫైటెక్ వాళ్లు.. నాలో ఫైర్‌వాల్ ఫర్మ్‌వేర్ ఏర్పాటు చేశారు. ఎవరైనా హ్యాక్ చేసేందుకు ట్రై చేస్తే.. వెంటనే మా యజమానికి వార్నింగ్ అలారం వచ్చేస్తుంది. వచ్చిన వెంటనే పూర్తిగా నన్ను షట్‌డౌన్ చేసేస్తారు. ఇదే అలారం వార్నింగ్ నన్ను తయారు చేసిన ఫైటెక్‌కి కూడా వెళ్తుంది. వాళ్లు కూడా క్షణాల్లో వార్నింగ్‌ని డిటెక్ట్ చేసి.. హ్యాక్ అవ్వకుండా ప్రోగ్రామింగ్ డిజైన్ చేసేశారు.

ఫైనల్‌గా నేను చెప్పేదేంటంటే.. నా ధర ఎంతో తెలుసా.? భయపడొద్దే... జస్ట్ రూ.2.5 లక్షల నుంచి స్టార్ట్ అవుతున్నా. అంతే.!

టైమవుతోంది.. బైబై వైజాగ్.!!







క్రీడా మైదానంలో బాణసంచా వెలుగులు

భక్తజనం బారులు.. నింగినంటిన సంబరాలు

- ముగిసిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవం
- నందడి నింపిన బాణసంచా వెలుగులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వేల్పులవీధి జంక్షన్ వద్ద శివుని విగ్రహం



ఉత్సవంలో భక్తజనం

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో గవరపాలెం మందుగుండు సీతారామస్వామి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన భారీ బాణసంచాను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భీమరశెట్టి రాంకీ, ఆలయ అధ్యక్షుడు వాకాడ బాబులు బాణసంచాను వెలిగించారు. రెండు గంటలకుపైగా బాణసంచా వెలుగులతో నింగి మెరిసింది. దీనిని వీక్షించేందుకు కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులతో క్రీడామైదానం కిక్కిరిసిపోయింది. ఉత్సవం సందర్భంగా పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్టేజ్ ప్రోగ్రాంలు, బుర్ర కథలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు అమ్మవారి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. అంతకుముందు రాత్రి 11 గంటలకు వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయంలో గౌరీపరమేశ్వరులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, పట్టణ, ట్రాఫిక్ , కశింకోట సీఐలు టి.వి.విజయకుమార్, ఎం.వెంకటనారాయణ, అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో గట్టి పోలీసుబందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి మద్దాల నూకరాజు, ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నర్సింగరావు, కోశాధికారి వేల్పుల గణేష్, సహాయ కార్యదర్శి పసుపు శ్రీకాంత్ పాల్గొన్నారు.

‘మానవుడు-మాధవుడు’ ప్రవచనానికి విశేష స్పందన



ప్రవచిస్తున్న వద్దిపర్తి పద్మాకర్



కార్యక్రమానికి హాజరైన భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఏలూరులోని ప్రణవ పీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ‘మానవుడు- మాధవుడు’ అనే అంశంపై ప్రవచనం చేశారు. అంతకుముందు కన్యకాపరమేశ్వరి అమ్మవారిని పద్మాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, గోపుజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గ భద్రకాళి విజయ వైష్ణవి శారద నారాయణ అనే నామాలతో పిలవబడే అమ్మవారు కన్యకాపరమేశ్వరిగా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బీళ్లపాటి కృష్ణకుమార్, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- వాసవీ క్లబ్ జిల్లా మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ
- నూతన కమిటీల ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ

చోడవరం: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. వాసవీ క్లబ్ అనకాపల్లి జిల్లా మహాసభ, అనుబంధ సంస్థల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం చోడవరంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామ సత్యనారాయణ మాట్లాడుతూ నిరు పేద ఆర్యవైశ్యులకు వాసవీ క్లబ్ సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తుందన్నారు. అంతా సంఘటితంగా ఉంటే అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందడానికి వీలుంటుందన్నారు. ప్రముఖ వ్యాపార వేత్త అంబికా గ్రూప్ అధినేత అంబికా కృష్ణ మాట్లాడుతూ వాసవీ క్లబ్ ద్వారా చేసే సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. చిన్న వ్యాపారులను కూడా ప్రోత్సహించడం ద్వారా వారి అభివృద్ధికి సహకారం అందించిన వాళ్లమౌతామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఇల్లూరి లక్ష్మయ్య, కొప్పురావూరి రజని, కంచర్ల ముత్యప్రసాద్, మాటూరి రంగనాథ్, కారుమూరి మహేష్, గోపిశెట్టి నాగేశ్వరరావు, కొల్లు సత్యనారాయణ, బెల్లాల పెంటబాబు, ముమ్మల విశ్వేశ్వరరావు, సి.ఎస్ కుమార్, మధవ, కలగర్ల శేషగిరిరావు, టి.ఎస్ గుప్తా పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌లో ఎమ్మెల్యేల సమీక్ష

- సమస్యలు తీరుస్తామని హామీ
- వెంటనే క్రషింగ్ ప్రారంభించాలని వినతి

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటకు తెచ్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. ఆదివారం ఫ్యాక్టరీని పరిశీలించి, అతిథిగృహంలో కార్మికులు, యాజమాన్యంతో సమీక్ష నిర్వహించారు. వారం రోజుల్లో కార్మికుల జీతభత్యాలు చెల్లిస్తామని, క్రషింగ్‌కు ఆటంకం లేకుండా వెంటనే ప్రారంభించాలని, రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. విశాఖ డెయిరీ, ట్రాన్స్‌కో నుంచి ఫ్యాక్టరీకి రావలసిన బకాయిలు వెంటనే రాబట్టేందుకు ఇప్పటికే ఆయా యాజమాన్యాలతో మాట్లాడామని చెప్పారు. ఫ్యాక్టరీని ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటకు తెచ్చి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఉప ఉత్పత్తుల యూనిట్లు నెలకొల్పేందుకు ప్రభుత్వంతో మాట్లాడతామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ ఏడాది క్రషింగ్ లక్ష్యం, ఫ్యాక్టరీ పనితీరు గురించి వారికి ఎండీ సన్యాసినాయుడు వివరించారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు కేవీవీ భాస్కరరావు, శరగడం రామునాయుడు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు



లాలంకొత్తూరులో కోడి పందాల రాయుళ్లను పందెం పుంజులతో పాటు పట్టుకున్న పోలీసులు

కశింకోట: మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించి కోడి పందాలు, గుళ్లాటలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. లాలంకొత్తూరులో కోడి పందాలు ఆడుతుండగా దాడి చేసి ఇద్దరు వ్యక్తులతోపాటు రెండు కోడి పుంజులు, రూ.1150 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. తీడ శివారులో గుళ్లాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద రూ.3210 నగదు, ఆరు గుళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ మనోజ్‌కుమార్, రైటర్ సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చని పల్లెల నడుమ క్వారీ లారీల చిచ్చు

- కూటమి నాయకుల హామీ రేపిన దుమారం
- లారీ యజమానులకు ఇక్కట్లు
- మార్టూరు, మాకవరం వర్సస్ చింతనిప్పల అగ్రహారం

తుమ్మపాల: హైదరాబాద్‌కు సముద్రం తీసుకొస్తానని ఓ సినిమాలో ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా నటుడు శ్రీకాంత్ చెప్పినట్టు రోడ్డుపై లారీలు తిరగకుండా చేస్తామంటూ కూటమి నాయకులు ఇచ్చిన హామీ మూడు గ్రామాల మధ్య చిచ్చు రేపింది. మండలంలో మార్టూరు, మాకవరం గ్రామాల్లోని క్వారీల నుంచి వచ్చిన రాయి, పిక్క, క్రషర్‌ను లారీల ద్వారా చింతనిప్పల అగ్రహారం గ్రామం మీదుగా అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి తరలిస్తున్నారు. అయితే తమ గ్రామంలో ఎటువంటి క్వారీ లేకపోయినా లారీల రాకపోకలతో దుమ్ము ధూళితో గ్రామం కలుషితమైపోయిందని, అనేక మంది కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని చింతనిప్పల అగ్రహారం గ్రామస్తులు పదేళ్లుగా ఆందోళన చేస్తున్నారు. దీన్ని అదునుగా చేసుకుని గ్రామం మీదుగా లారీల రాకపోకలు నిలిపేస్తామంటూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ఇప్పుడు తంటా తెచ్చిపెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇచ్చిన హామీని నెరవేర్చాలని గ్రామస్తులు అనేకసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులంతా ఏకమై గ్రామం మీదుగా లారీల రాకపోకలను నిలిపివేశారు. దీనిపై లారీల యాజమానుల ఫిర్యాదు చేయడంతో పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా కూటమి కార్యకర్తలపై కేసులు నమోదు చేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహించడంతో చేసేదేమి లేక పోలీసులు ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారు. లారీల రాకపోకలు నిలిపివేయడంతో మార్టూరు, మాకవరానికి చెందిన లారీల యాజమానులు కూటమి నాయకుల దృష్టికి తమ సమస్యను తెలియజేశారు. చింతనిప్పల అగ్రహారం రోడ్డుపై లారీల రాకపోకలు నిలిపివేయడం సబబు కాదని, లారీలపై జీవించే వందల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ప్రత్యామ్నాయ రోడ్డు ద్వారా రాకపోకలు చేస్తే సుమారు 10 కిలో మీటర్లు దూరం పెరుగుతుందని తమ గోడును నాయకులు వద్ద విన్నవించుకున్నారు. అయితే పరిష్కరించే మార్గం లేక చేతులెత్తేసారు. దీంతో ఆయా గ్రామాల లారీ యాజమానులు కూడా అందుకు ప్రతిగా చింతనిప్పల అగ్రహారం గ్రామానికి చెందిన లారీలపైనా నిషేధం విధించారు. మార్టూరు, మాకవరం గ్రామాల్లోనే అన్ని క్వారీలు, క్రషర్లు ఉండడంతో వారికి లోడింగ్ చేసేది లేదని, క్వారీలు తమను కాదని లోడింగ్ ఇస్తే పనులు నిలిపేస్తామని హెచ్చరించడంతో కొత్త సమస్య వచ్చిపడింది. ఇలా కూటమి నాయకుల ఎన్నికల హామీ గ్రామాల నడుమ చిచ్చు రగిల్చింది. మూడు నెలలుగా కొనసాగుతున్న ఈ సమస్య తీవ్ర దుమారంగా మారే అవకాశం ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు గంగరాజు, గంగాదేవిపేట



ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనం

మునగపాక: మునగపాక దరి ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాదచారుడు మృతి చెందారు. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గంగాదేవిపేటకు చెందిన బత్తిన గంగరాజు(65) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి మునగపాక నుంచి గంగాదేవిపేటకు నడుచుకుంటూ వస్తున్నాడు. అయిదు మదుంల జంక్షన్‌కు వచ్చే సరికి అనకాపల్లి నుంచి మునగపాక వైపునకు వస్తున్న ద్విచక్ర వాహనం అతనిని బలంగా ఢీకొట్టింది. దీంతో గంగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మునగపాక ఎస్‌ఐ పి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు గంగరాజుకు భార్య వెంకయమ్మ, కూతురు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న గంగరాజు మృతితో కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు.

డీఎస్పీ విష్ణుస్వరూప్ బాధ్యతల స్వీకరణ



పరవాడ: పరవాడ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా వి.విష్ణు స్వరూప్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన కేవీ సత్యనారాయణ నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ స్థానిక పరిస్థితులపై అవగాహన పెంచుకుని, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ నేరాలను అదుపు చేస్తామన్నారు. ప్రజలకు పోలీసు సేవలను సమర్థవంతగా అందించేందుకు తన వంతు కృషి చేస్తానని డీఎస్పీ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన విష్ణు స్వరూప్‌ను పరవాడ, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం సీఐలు, ఎస్‌ఐలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

పీఎం పాలెం (విశాఖ): గంజాయి పాకెట్లు విక్రయించడానికి యత్నిస్తున్న నలుగురు యువకులను పీఎం పాలెం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమ్మాది ఏపీ హెచ్‌బీ రోడ్డులో కొంత మంది గంజాయి పాకెట్లు విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ భాస్కరరావు సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. గంజాయి విక్రయించడానికి యత్నిస్తున్న కొమ్మాది రీ కాన్ టవర్స్‌లో నివసిస్తున్న లోకోజీ భాస్కరరావు(20), టేకు రాజేష్(20), నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎర్లంకి దుర్గా మోహన్‌సాయి(24), రాంబాబులను అదుపులోకి తీసుకున్నారు.

లంకె బిందెల పేరుతో ఘరానా మోసం

నకిలీ స్వామీజీతో కలిసి రూ.28 లక్షలు కాజేసిన ఇద్దరు వ్యక్తులు

మధురవాడ: మంత్రాలతో చింతకాయలు రాలవని తెలిసి కూడా కొందరు అమాయకంగా దొంగ స్వాములను నమ్మి బలైపోతున్నారు. దీనికి ఆనందపురం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఓ ఘటనే ఉదాహరణ. మండలానికి చెందిన నలుగురి నుంచి ఓ నకిలీ స్వామితో కలిసి ఇద్దరు వ్యక్తులు రూ.28 లక్షల వరకూ వసూలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆనందపురం మండలం వేముగొట్టిపాలేనికి చెందిన కె.ఎ.రాజు, మల్కాపురానికి చెందిన పీవీ భార్గవరావు అలియాస్ మునిస్వామితో పాటు గాజువాకకు చెందిన డేరింగ్ కృష్ణ నమ్మించి మోసం చేసినట్టు సమాచారం. బీపీ కళ్లాలకు చెందిన తాతారావు సదరు నలుగురు బాధితులకు స్వామీజీని గతేడాది నవంబరులో పరిచయం చేశాడు. స్వామీజీ తన వద్ద బంగారు నిధి ఉందని, పూజలు చేయడానికి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పాడు. బాధితులు రూ.28 లక్షలు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. పూజలు చేస్తేనే లంకె బిందెలు దక్కుతాయని, లేకపోతే రక్తం కక్కుకుని చనిపోతారని బాధితులను స్వామీజీతో పాటు అతని మనుషులు బెదిరించారు. డబ్బులు వెంటనే ఇచ్చేయాలని డిమాండ్ చేయడంతో తాతారావుతో పాటు మరో ముగ్గురు వ్యక్తుల సమక్షంలో బాధితులు దఫదఫాలుగా మొత్తం రూ.28 లక్షలు మునిస్వామికి అందజేశారు. ఈ నెల 2న లంకె బిందెలను గుడిలోవ పరిసర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన బాధితులు తమ గెస్ట్ హౌస్‌లో భద్రపరిచారు. ఆ తర్వాత నుంచి స్వామీజీ పరారయ్యాడు. అనుమానం వచ్చిన బాధితులు స్వామీజీకి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. లంకె బిందెల్లో ఏమీ లేకపోవడంతో లబోదిబోమంటూ బంధువుల వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో బాధితుల బంధువు ఒకరు నాలుగు రోజుల కిందట ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి, ఆనందపురం-బోని రోడ్డులో బుద్ధుని విగ్రహం వద్ద స్వామిని, ఇతర ప్రాంతాలలో మిగతా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి పాత రాగి సామగ్రి, కారు, రూ.70 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. మునిస్వామి, రాజు, కృష్ణలను రిమాండ్‌కు తరలించినట్టు సమాచారం.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

- సోషల్ మీడియా సహకారం స్ఫూర్తిదాయకం
- జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్
- ఉత్సాహంగా ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ వాక్‌థాన్



భారీ క్లాత్ బ్యానర్‌తో వాకథాన్

ఏయూ క్యాంపస్: నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధం అందరి బాధ్యతని, ఇందుకు సామాజిక మాధ్యమ కార్యకర్తలు (సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు) అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. జీవీఎంసీ, వైజాగ్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్, వైజాగ్ సిటీ పేజెస్, ఇన్నా కమ్యూనిటీ, మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా ఆర్కే బీచ్‌లో ఆదివారం ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ కార్యక్రమం నిర్వహించాయి. పుష్ప-2 చిత్రం నటి కుమారి పావని ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుంచి పూర్తి స్థాయిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నగరంలో నిషేధించామన్నారు. విశాఖ నగరంలో ఒక్క రోజులో 15 టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ప్రజలు వినియోగిస్తున్నారని చెప్పారు. వీటిని ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ వస్తువుల విక్రయం, వినియోగం, సరఫరా చేసినా జరిమానా విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను దేశంలో ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యంగా జీవీఎంసీ యంత్రాంగం నిత్యం పని చేస్తుందన్నారు. అనంతరం ‘లెట్స్ మేక్ ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్’ అంటూ 100 అడుగుల వస్త్రంతో తయారు చేసిన బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా వాక్‌థాన్ నిర్వహించారు. తరువాత బీచ్‌లో వ్యర్థాలను ఏరివేశారు. టీ తాగండి-కప్ తినండి అనే నినాదంతో క్రంచి బిస్కెట్ కప్స్ సంస్థ రాగి పిండితో తయారు చేసిన టీ కప్పులను ఆవిష్కరించారు.

నటి పావని మాట్లాడుతూ మానవులకు, మూగ జీవాలకు ప్లాస్టిక్ పెనుముప్పుగా మారుతోందని, మన భవిష్యత్తు కోసం, పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్‌కుమార్, జీవీఎంసీ అదనపు కమిషనర్లు ఎస్.ఎస్.వర్మ, డి.వి.రమణమూర్తి, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, సహాయ వైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌కుమార్, సునీల్‌కుమార్, అప్పలనాయుడు, నగరానికి చెందిన 600 మందికి పైగా సోషల్ మీడియా కార్యకర్తలు, జీవీఎంసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్‌శాఖ డి–1, 2 సెక్షన్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈఈ కె.రాజశేఖర్, డి–1, 2 సెక్షన్ ఏఈలు త్రినాథ్, జి.వై.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ టౌన్ ఫీడర్ పరిధిలో గుండాలవీధి, లక్ష్మీదేవిపేట, గాంధీనగరం, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ, రైల్వే అండర్ బ్రిడ్జి వరకూ, డి–2 సెక్షన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకూ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. 11కేవీ పరిధిలో నూకాంబిక ఆలయ రహదారి, రాజీవ్‌గాంధీ ఇండోర్ పరిధిలో నూకాంబిక ఆలయ రహదారి, చాకలిపేట, అగ్గిమర్రిచెట్టు, కోటవీధి, రాణిగారితోట, ఏడీ స్కూల్ ఏరియా తదితర ప్రాంతాల్లో సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గ్రామాల్లో సందడిగా తీర్థాలు

కశింకోట: మండలంలోని సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరులో ఆదివారం రాముల వారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట వస్తువులు, తినుబండారాలు, అలంకరణ వస్తువుల అమ్మకాలు సాగాయి. తోడపెద్దు సేవ నిర్వహించారు. కశింకోటలోని గవరపేటలోని మధ్య వీధిలో తీర్థ మహోత్సవాన్ని నిర్వహించి తోడపెద్దు సేవ చేశారు.

జాబ్‌మేళాకు స్పందన



నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు చేస్తున్న కంపెనీల ప్రతినిధులు

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో సామాజిక కార్యకర్త బుద్ధ ఉషశ్రీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా ఆదివారం నిర్వహించారు. పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు అధిక సంఖ్యలో మేళాకు హాజరయ్యారు. 32 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర జాబ్ మేళాను పరిశీలించి ఉషశ్రీని అభినందించారు.

గుండాట ఆడుతున్న ముగ్గురిపై కేసు

యలమంచిలి రూరల్: కనకమహాలక్ష్మి జాతరకు వచ్చే జనం జేబులు కొల్లగొట్టడమే లక్ష్యంగా కొందరు సమీపంలో గుండాట నిర్వహిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని ముగ్గురు నిర్వాహకులను పట్టుకున్నారు. కపిశెట్టి ప్రకాష్, యర్ర రాము, పూడి శ్రీనుల వద్ద నుంచి రూ.వెయ్యి, గుండాటకు ఉపయోగించిన డైస్, బోర్డులను స్వాధీనపర్చుకున్నామని పట్టణ ఎస్సై కే సావిత్రి ఆదివారం రాత్రి తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	: సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజర్	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
గేమ్ ఛేంజర్	: వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	: శ్రీసత్య
డాకు మహారాజ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 261 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 197 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



గండ్లు పడిన గ్రోయిన్



తుప్పలు బలిసి అధ్వానంగా ఉన్న సాగునీటి కాలువ



దెబ్బతిన్న వెదురుపర్తి గ్రోయిన్

పుష్కర కాలంగా నిర్లక్ష్యమే!

- మరమ్మతులకు నోచుకోని వెదురువర్తి గ్రోయిన్
- వృథాగా పోతున్న సాగునీరు
- ఏటా పంటలకు నష్టం
- అన్నదాతల ఆందోళన



కశింకోట: పుష్కర కాలం పైగా మరమ్మతులకు నోచుకోలేదు. వందలాది ఎకరాలకు సాగునీరు అందడం లేదు. ఆయకట్టు రైతులు ఏటా వేలాది రూపాయలు నష్టపోక తప్పని పరిస్థితి. ఇది శారదా నదిపై ఉన్న వెదురుపర్తి గ్రోయిన్ దుస్థితి. మండలంలోని వెదురుపర్తి గ్రామం వద్ద శారదానదిపై గ్రోయిన్ దెబ్బతిని ఉంది. దీని కింద 750 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ఏటా చెరకు, వరి పండిస్తారు. వెదురుపర్తి, పేరంటాలపాలెం, బయ్యవరం రెవెన్యూకు చెందిన భూములు దీనికింద సాగవుతున్నాయి. 2011లో వచ్చిన నీలం తుపాను వరదల్లో గ్రోయిన్ దెబ్బతిని గండ్లు పడింది. 2012 హుద్‌హుద్ తుఫాన్ వరదలకు మరింత దెబ్బతింది. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులకు రూ.5 లక్షలు మంజూరైనప్పటి కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో నిధులు మురిగిపోయాయి. **అప్పటి నుంచి గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టలేదు. అటు అధికారులగాని, ఇటు ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. దీంతో ఆయకట్టుకు నీరందక దిగువకు వృథాగా పోతోంది. చుక్క నీరు కూడా దీని పంట** కాలువ ద్వారా ఆయకట్టుకు అందడం లేదు. కాలువ తుప్పలతో బలిసి అధ్వానంగా ఉంది. పంటలకు సాగు నీరు అందక రైతులు ఏటా నష్టపోతున్న పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఏదో వరుణ కటాక్షం మీద, బోర్ల నీటి సహాయంతో ఆయకట్టుదారులు పంటలను పండిస్తున్నారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాకు పరిధులు ఉండటం వల్ల సొంత బోర్లు ఉన్న వారికే పూర్తిగా నీరు సరిపోవడం లేదు. ఇక ఇతరులు కొనుగోలు చేసుకుందామన్నా నీరు లభ్యం కాని పరిస్థితి. దీంతో వర్షాల పైన ఆధారపడి పంటలు పండిస్తున్నారు. సకాలంలో సరైన నీటి సదుపాయం లేక దిగుబడి తగ్గిపోయి, పంటలు దెబ్బతిని ఏటా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. దీనిదృష్ట్యా గ్రోయిన్‌కు సత్వరమే మరమ్మతులు చేపటి ఆయకట్టుకు సాగునీరు అందించడానికి అధికారులు, ప్రజా ప్రజా ప్రతినిధులు చర్యలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏటా తీవ్రంగా నష్టపోతున్నాం



వెదురుపర్తి గ్రోయిన్ ఆయకట్టు కింద ఉన్న భూమిలో ఏటా వరి, చెరకు పంటలను **సాగు చేస్తున్నాం. నీలం తుపాను** సమయంలో గ్రోయిన్ దెబ్బతిని గండ్లు పడ్డాయి. **అప్పటి నుంచి నీరు వృథాగా** దిగువకు పోతోంది. ఆయకట్టుకు చుక్క సాగునీరు అందడం లేదు. దీంతో పంటలు పండక, దిగుబడి తగ్గిపోయి ఏటా తీవ్రంగా నష్టపోవలసి వస్తోంది. దీని దృష్ట్యా గ్రోయిన్‌కు సత్వరమే మరమ్మతులు చేపట్టి సాగు నీరు అందివ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అల్లవరపు నాగు, రైతు, వెదురుపర్తి

మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం



వెదురుపర్తి గ్రోయిన్ కింద ఉన్న భూమిలో వరి సాగు చేస్తున్నాను. గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తుండటం వల్ల సాగునీరు అందడం లేదు. దీంతో బోరు నీటి సహాయంతో పంటలను పండించాల్సి వస్తోంది. సరిగ్గా విద్యుత్ సరఫరా లేక నీరు సరిపోక పంట దిగుబడి తగ్గిపోతోంది. ఇది ఆర్థికంగా భారం కూడా అవుతోంది. దీంతో నష్టపోవలసి వస్తోంది. దీని దృష్ట్యా గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నున్నం అప్పన్న, రైతు, వెదురుపర్తి

ప్రభుత్వానికి నివేదించాం

వెదురుపర్తి గ్రోయిన్ మరమ్మతులకు రూ.73 లక్షలతో మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ఉన్నతాధికారుల ద్వారా నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం.

– అమూల్య, ఏఈ, నీటిపారుదల శాఖ డివిజన్, అనకాపల్లి

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



అగ్ని ప్రమాదంలో బాధితులకు తన వంతు సాయం అందిస్తున్న ఎంపీటీసీ చదల కృష్ణదొర

మాడుగుల రూరల్ : మండలం అవురువాడ గ్రామంలో ఈ నెల 18 న జరిగిన అగ్ని ప్రమాదంలో తుమ్మి అప్పారావు తాటాకు ఇల్లు కాలిపోయి తీవ్రంగా నష్టపోయాడు. దీంతో ఈ సెగ్మెంటు ఎంపీటీసీ చదల కృష్ణదొర తన సొంత నిధులతో సమకూర్చిన నెల రోజులకు సరిపడా బియ్యం, పప్పు, నూనె, మిరపకాయలు తదితర స్వయం పాకం సరుకులు, వారి కుటుంబానికి దుస్తులు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కీముడు త్రిమూర్తుల దొర, టి.బన్ని, ఇ.టి.రాజు, ఆర్ మోవల్లదొర, కొంగల శ్రీను పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 16 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చీడికాడ : చుక్కపల్లిలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 16 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికైనట్టు శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ క్యాంపులో 54 మందికి కంటి పరీక్షలు చేయగా, వీరిలో 30 మందికి చిరు కంటి సమస్యలకు మందులు అందించామన్నారు. 16 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామని, వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చెస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఆనందంతో డ్యాన్స్ చేస్తున్న పూర్వ విద్యార్థులు



కశింకోటలో పూర్వ విద్యార్థుల సందడి

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలుకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆద్యంతం ఆకట్టుకుంది. 25 ఏళ్ల తర్వాత తొలిసారిగా వీరు కలుసుకున్నారు. ఇందుకు ఆదివారం స్థానిక ప్రమీలా తోట వేదిక అయింది. 1999–2000 టెన్త్ బ్యాచ్ విద్యార్థులంతా ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగా క్షేమాలు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఆనందపరవశులయ్యారు. ఆట, పాటలు, నృత్యాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. సామూహికంగా ఫొటో దిగారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు శోభారాణి, అపర్ణ, శ్రీలక్ష్మి, కళావతి, శమంతకమణి, అరుణ, రాధ, హర్షవర్ధన్, రాజు, శ్యాం, సత్యనారాయణ, సాగర్, వరలక్ష్మి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్



పెదగుమ్ములూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ఎస్.రాయవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని, వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పెద గుమ్ములూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు నిరసన తెలిపారు. అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు నష్టం కలిగించే విధంగా బీజేపీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తున్న బీజేపీ నేతలపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నప్పటికీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నోరు మెదపక పోవడం దారుణమన్నారు. అంబేడ్కర్‌ను కించపరచడంతో బీజేపీ నిజస్వరూపం బయటపడిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రకటించారని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి 240 సీట్లకే పరిమితం చేశారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు ఎం.సత్యనారాయణ, స్థానిక నాయకులు భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామకోటి పుస్తకాల పంపిణీ



భక్తులకు రామకోటి పుస్తకాలను అందిస్తున్న రామకోటి సేవా సంఘం ప్రతినిధి బాబూరావు

పరవాడ: దేవాలయం కేంద్రంగా వారానికి రెండు రోజులు పారాయణ, భజన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని రామకోటి సేవా సంఘం ప్రతినిధి ఎం.బాబూరావు పిలుపునిచ్చారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ రామాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రామాయణంలో రాముడు మనిషిగా జన్మించి, మనుషులు ఏ విధంగా జీవించాలో లోకానికి చాటిచెప్పారన్నారు. పిల్లలు తల్లిదండ్రులను ఎలా గౌరవించాలో కూడా రాముడి జీవితం ఆదర్శమన్నారు. అనంతరం భక్తులకు రామకోటి పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకోటి సభ్యులు యు.తిరుపతిరావు, కె.వెంకటరావు, జె.రమేష్, మాతృమూర్తులు వి.అమ్మాజి, పి.చిట్టెమ్మ, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, సూరిబాబు, జగదీష్, అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


పెరిగిన ఉపాధి అవకాశాలు

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వ సహకారంతో గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగులకు, మహిళలకు మంచి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కైట్స్ స్కిల్స్ సంస్థ అధినేత గొర్లె రామునాయుడు అన్నారు. ఆదివారం పెందుర్తిలోని కైట్స్ సంస్థలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్, జిల్లా కో ఆర్డినేటర్లు వనజ, గౌరినాయుడు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాళ్లపాలెంలో సీతారాముల తీర్థం



తాళ్లపాలెంలో విద్యుద్దీపాలతో ఏర్పాటు చేస్తున్న దేవతామూర్తుల కటౌట్



తాళ్లపాలెంలో సీతారాముల ఆలయం విద్యుద్దీపాలంకరణ



తాళ్లపాలెం వద్ద విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన తీర్థ ముఖ ద్వారం



నర్సీపట్నం రోడ్‌లో విద్యుద్దీపాలంకరణ



తాళ్లపాలెంలో సీతారాముల తీర్థానికి ఏర్పాటు చేసిన ఆలయ సెట్టింగ్

కశింకోట: తాళ్లపాలెంలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని పెద్ద ఎత్తున సోమవారం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. మండలంలో జరిగే తీర్థాల్లో పెద్ద తీర్థం ఇదే కావంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చి ఉత్సాహంగా పాల్గొంటారు. ఈ సందర్భంగా తీర్థానికి వచ్చే వారికి స్వాగతం పలుకుతూ ముఖ ద్వారంతోపాటు విద్యుద్దీపాలతో అలంకరించిన దేవతామూర్తుల బొమ్మలతో పెద్ద కటౌట్ ఏర్పాటు చేశారు. తీర్థం జరిగే తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్‌లో విద్యుద్దీపాలంకరణ చేశారు. తీర్థంలో రంగుల రాట్నాలు, ఆకాశ చక్రాలు ఉత్సవంలో కనువిందు చేయనున్నాయి. ఆట వస్తువులు, తిను బండారాలు, ఇళ్లలో సామగ్రి, అలంకరణ వస్తువుల అమ్మకాలు ఎక్కువగా జరగనున్నాయి. తీర్థం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



సరుగుడు వద్ద జలపాతంలో జలకాలాట

నాతవరం : సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఎత్తయిన రెండు కొండలు మధ్యలోంచి ప్రవహించే జలపాతంలో సందర్శకులు జలకాలు అడుతూ ఉత్సాహంగా గడిపారు. సంహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలక్షేపం చేశారు. రెండు జిల్లాల నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో సరుగుడు వెళ్లే రోడ్డులో వాహనాల తాకిడి పెరిగింది.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్ల, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.